క్లుప్తంగా

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలి తెలంగాణ రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. గురువారం నాంపల్లిలోని కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఉద్యోగులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులు వివరించారు. ఉద్యోగుల గత ఆగస్టు నెల నుంచి వేతనాలు తప్ప ఇతర బిల్లులు విడదల కావడం లేదన్నారు. పీఆర్‌సీ 2020 ఎరియర్స్, ఇంక్రిమెంట్స్, మెడికల్, పిల్లల చదువులకు, అమ్మాయిల పెళ్లి, తల్లిదండ్రుల ఆరోగ్య కోసం జమ చేసిన జీపీఎఫ్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులకు దూరం చేయడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని ప్రతినెలా 1వ తేదీన వేతనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం



ఎంఎన్‌జే ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: మానవ సేవే మాధవ సేవ అని టీఎస్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద దాదాపు 2 వేల మందికి గురువారం అన్నదానం నిర్వహించారు. అనంతరం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. సమాజ సేవ చేయడం ద్వారా ఎంతో తృప్తి, ఆనందం ఉంటుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పబ్లిక్‌గార్డెన్ మైసమ్మ ఆలయంలో పూజలు, యూసుఫ్ బాబా దర్గాలో ప్రార్థనలు చేశామన్నారు. రాజ్‌కుమార్, ఖాలీద్ అహ్మద్, కుర్రాడి శ్రీనివాస్, శంకర్, శివకుమార్, ఎంఏ ముజీబ్, వహీద్, మహ్మద్ ముస్తఫా, ఉస్మాన్ అలీ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవితను మోదీ ప్రభుత్వం వేధిస్తోంది'

అబిడ్స్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీలు, సీబీఐల పేరిట కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేధిస్తోందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ లభిస్తుండడంతో తట్టుకోలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై వేధింపులకు పాల్పడుతుందన్నారు. ఢిల్లీకి వెళ్లిన కవితకు గోషామహల్ నుంచి తన అనుచరులతో కలిసి ఢిల్లీలో కవితకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌కు తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా ఆదరణల లభిస్తుందన్నారు. ఈడీ కానీ, సీబీఐ కానీ కవితను ఏమీ చేయలేవని ఆయన అన్నారు.

సత్తా చాటిన 'ఉస్మానియా విద్యార్థులు'



అశ్రిత

సుల్తాన్‌బజార్: ఎన్‌ఈఈటీ పీజీ–2023లో అత్యున్నత పీజీ ర్యాంక్‌ను ఉస్మానియా మెడికల్ కళాశాల విద్యార్థులు సాధించారు. ర్యాంక్‌లు సాధించిన వారిలో నగరంలోని డాక్టర్ భాటియా మెడికల్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన అఛీవర్ క్యాంపస్ నుంచి 600లకు పైగా ర్యాంకులతో విద్యార్థులు మెడికల్ పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లను సాధించారని అఛీవర్స్ క్యాంపస్ ఉమ్మడి రాష్ట్రాల డైరెక్టర్లు డాక్టర్ సాయి ఇంద్రసేనా, సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నీట్ పీజీ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులే లక్ష్యంగా ఉత్తమ ఫ్యాకల్టీ రెగ్యులర్ ఎగ్జామ్‌ను అందించడంతోనే వైద్య విద్యార్థులు ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. ర్యాంకులు సాధించిన వారిలో జిషాన్ అహ్మద్ జలీల్, అశ్రిత ఉన్నారు.

ఫుట్‌పాత్‌లపై చెత్త డబ్బాల ఏర్పాటు



టోలిచౌకి–మెహిదీపట్నం రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పైన ఏర్పాటు చేసిన చెత్తడబ్బాలు

గోల్కొండ: రోడ్లు, ఫుట్‌పాత్‌లను శుభ్రంగా ఉంచేందుకు బల్దియా వారు రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లపై కొత్త చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా ఒక్కో ఫుట్‌పాత్‌పై ఓ స్టాండ్ ఏర్పాటు చేసి వాటికి మూడు డబ్బాలు బిగించారు. గతంలో పొడి, తడి చెత్తకు కేవలం రెండే డబ్బాలు ఏర్పాటు చేసేవారు. అయితే ఈసారి హానికర చెత్త కోసం ఎరుపు రంగు డబ్బాను ఏర్పాటు చేశారు.

పని చేయని చేతి పంపులు.. పట్టించుకోని అధికారులు

- నిరుపయోగంగా చేతి పంపులు, కుళాయిలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గోల్కొండ బడాబజార్‌లోని చేతి పంపు, కుళాయి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

గోల్కొండ: చేతి పంపులు, నల్లాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన చేతి పంపులు ఇప్పటికే ఎన్నో కనుమరుగు అయ్యాయి. బస్తీలో ఇంటి ముందున్న నల్లాలను స్థానికులు పూర్తిగా మాయం చేసి కబ్జా చేసుకున్నారు. నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో ఇప్పటికే నల్లాల స్థలలు, చేతి పంపులు కనుమరుగమయ్యాయి. పలు ప్రదేశాల్లో మిగిలి ఉన్న చేతి పంపులు మరమ్మతులు లేక వట్టిపోతున్నాయి. టోలిచౌకి, గోల్కొండ, బడాబజార్ తదితర ప్రాంతాల్లో ఉన్న చేతి పంపుల వద్ద వ్యర్థాల డంపింగ్ జోరుగా సాగుతుంది. ఈ ప్రదేశాలలో కుళ్లిన వ్యర్థాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఈ కారణంగా నీటి కోసం ఎవ్వరూ రావడం లేదు. అధికారులు చేతి పంపులు, నల్లాల పరిసరాలను చుట్టూ పరిశుభ్రంగా ఉంచి, వాటి చూట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చేతి పంపులు, పబ్లిక్ నల్లాలు గాయబ్..

అధికారుల నిఘా లోపం కారణంగా ఎన్నో నల్లాలు, చేతి పంపులు గప్‌చుప్‌గా గాయబ్ అయ్యాయి. మెహిదీపట్నంలోని హసన్ హోటల్ ముందు ఉన్న బోరును హోటల్ భవన యజమాని పూర్తిగా తొలగించి అనుమానం రాకుండా హోటల్ ముందు ప్రాంతాన్ని సిమెంట్ చదును చేసేశాడు. గోల్కొండ, బంజార దర్వాజ వద్ద ఉన్న పబ్లిక్ నల్లా మాయమైపోయింది. అదే విధంగా ఎండీ లైన్స్, మసీదు వద్ద గత పాతిక సంవత్సరాలుగా ఉన్న పబ్లిక్ నల్లా కనుమరుగైపోయింది. పబ్లిక్ నల్లాకు ఉన్న పైపులు, దానికి ఉన్న ప్లాట్‌ఫాం గాయబ్ అయింది. ఆ ప్రదేశంలో అక్రమంగా ఒక డబ్బా వెలిసింది. అదే విధంగా మెహిదీపట్నం ఎఫ్ బి కేఫ్ వెనుక ఉన్న బోరు కూడా పూర్తిగా మాయమైపోయింది. ప్రస్తుత అధికారులకు తమ పరిధిలో ఎన్ని పబ్లిక్ బోర్లు ఉన్నాయి, ఎన్ని పబ్లిక్ నల్లాలు ఉన్నాయి అన్న వివరాలు కూడా కార్యాలయాల్లో లేవు.

నాలాల విస్తరణ పనులను వేగవంతం చేయాలి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: నాలాల విస్తరణ పనులను వేగవంతం చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని యాకుత్‌పురా, రెయిన్‌బజార్, మౌలా కా చిల్లా, ముర్తుజానగర్, యశ్రబ్‌నగర్, అమాన్‌నగర్–ఏ ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా మరమ్మతు పనులను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వర్షాకాలంలో వరదా నీటి కారణంగా నాలాల పరీవాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. నాలాల నుంచి స్థానికులకు సమస్యలు రాకుండా కొన్నిరోజుల క్రితం నాలాల విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా సంజయ్‌కుమార్



సంజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న సహచర న్యాయవాదులు

గన్‌ఫౌండ్రీ: డీఆర్‌టీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా బి.సంజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం అబిడ్స్‌లోని ట్రిబ్యునల్ ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం డీఆర్‌టీ న్యాయవాదులు ఇతర బార్ అసోసియేషన్లపై ఆధార పడవాల్సి వస్తుందని, దీని వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ నిధి నుంచి డీఆర్‌టీ అసోసియేషన్‌కు నిధులు అందజేయాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడిగా టి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ముఖేష్ తివారి, వి.సత్యనారాయణ, రమణకుమారి, నరేంద్రకుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

దళిత బంధు పథకం దేశానికే ఆదర్శం



మంత్రి తలసానికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చైర్మన్ కొమ్ముల నరేందర్

అబిడ్స్: దళితబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. నూతన సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరును నామకరణం చేసినందుకు బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏప్రిల్ 9న భారీ కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నామని చైర్మన్ కొమ్ముల నరేందర్ మంత్రి తలసానికి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నూతన సచివాలయానికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరును నామకరణం చేయడం సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పథకాలను పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దాసోజు శ్రవణ్, బొంతు రామ్మోహన్, కట్టెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: విద్యా సంస్థల వారు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ నిరుపేదలు, అనాథ పిల్లలకు ఉచితంగా చదివించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండలోని అలయన్స్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో గురువారం నూర్–ఎ–అలయన్స్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రెండు దశాబ్దాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న అలయన్స్ స్కూల్ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదని నిరుపేదల పిల్లలు సైతం ప్రతిభావంతులని, వారికి సరైన మార్గనిర్దేశనం చేస్తే వారు ఉన్నత చదువులు చదివి దేశానికి సేవలు అందించగల్గుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, పాఠశాల కరెస్పాండెంట్ సయ్యద్ ఆరిఫ్, వీనస్ స్కూల్ కరెస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్, హారూన్ ఫరాన్, మజ్లిస్ నాయకులు బదర్ ఉద్దీన్, బాబర్ అలీఖాన్ తదితరులున్నారు.

హజ్ టర్మినల్ పనులు వేగంగా పూర్తి చేయండి

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హజ్ టర్మినల్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం జీఎంఆర్ అధికారులకు సూచించారు. హజ్ టర్మినల్ ఏర్పాటు పనులను పరిశీలించిన అనంతరం నాంపల్లి హజ్ హౌస్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. హజ్ 2023 యాత్రకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2019 హజ్ యాత్ర వరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక టర్మినల్ ఉండేదని, ఎయిర్‌పోర్టు విస్తరణలో భాగంగా టర్మినల్‌ను ఎత్తి వేశారన్నారు. ఈ ఏడాది హజ్ యాత్ర కోసం జీఎమ్ ఆర్ అత్యాధునిక సౌకర్యాలతో హజ్ టర్మినల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ దాదాపు 90 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఏప్రిల్ చివరి పనులు పూర్తి అవుతాయన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: చరిత్రకు సంబంధించిన విలువైన సాహిత్యం ప్రజల ముందుకు తీసుకువస్తే పుస్తక రూపంలో ముద్రిస్తామని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో హయత్‌బక్షీబేగం జీవితచరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు గొప్ప చరిత్ర ఉందని, ఆ చరిత్ర ప్రజలలోని వారి జీవన విధానంలోనే ఉంటుందని తెలిపారు. ఇక్కడ చరిత్రలో ఇంకా వెలుగులోకి రావాల్సినటువంటి జీవన విధానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సీతారామారావు, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, ప్రొఫెసర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అనార్కలి పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ, పాలపిట్ట బుక్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అమ్జద్ అనువాదించిన అనార్కలి పుస్తకావిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాప్రోలు సుదర్శన్, విమర్శకులు ఏకే.ప్రభాకర్, కవి అబ్దుల్ వాహీద్, అనువాదకులు రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవనానికి ఉర్దూలో సూచిక బోర్డు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న ఎజాజ్ అలీ ఖురేషి, వాహెద్ అలీఖాన్

యాకుత్‌పురా: పురానీహవేలిలోని పాత ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యూనల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కాలాపత్తు కోర్టు భవనం పేరు సూచిక బోర్డును ఉర్దూలో ఏర్పాటు చేయాలని కోరుతూ అంజుమాన్–ఇ–తరాకి–ఓ–బఖా ఉర్దూ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషి, న్యాయవాది వాహెద్ అలీఖాన్ గురువారం రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సుజానకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ కొనసాగిన ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో ఇటీవల నూతన కోర్టు భవనాన్ని నిర్మించారన్నారు. ప్రజల సౌకర్యార్థం భవనం ముందు సూచిక బోర్డును ఉర్దూ భాషలో ఏర్పాటు చేయలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సుజానకు వినతిపత్రం అందజేశామన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సీపీఆర్ ఎలా చేయాలో తెలిపే విధానంపై రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఫర్హీన్ షేక్ మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ ద్వారా చికిత్సను అందిస్తే వారి కాపాడవచ్చాన్నారు. ఈ విధానంపై పౌరులందరికీ అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ సభ్యులు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ మండల కార్యాలయ సిబ్బంది, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి

గోల్కొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ఎన్నో చర్యలు తీసుకుందని రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారెఖ్ అన్సారీ అన్నారు. గురువారం రాష్ట్ర అడ్వకేట్ ఫోరం ఫర్ జస్టిస్ చైర్మన్ వహీద్ అహ్మద్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తారెఖ్ అన్సారీ మాట్లాడుతూ.. 8 ఏళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీల కోసం వేలాది కోట్ల రూపాయలు వెచ్చించిందన్నారు. మైనార్టీలు ఆర్థికంగానే గాక విద్యా రంగంలో కూడా రాణించాలన్న దృక్పథంతో మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మైనార్టీస్ కమిషన్ సభ్యులు అఫర్ ఉల్లా, మహ్మద్ తన్వీర్ తదితరులున్నారు.



మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీతో వహీద్ అహ్మద్

ప్రధాని మోదీ హయాంలో క్రీడల్లో భారత్ అగ్రగామి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు అమర్ సింగ్

గోల్కొండ: ప్రధాని మోదీ హయాంలో క్రీడల్లో మన దేశం దూసుకుపోతుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. గురువారం కార్వాన్ సరస్వతి శిశుమందిర్‌లో చాలో భారత్ జీతో భాగ్యనగర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా చలో భారత్ జీతో భాగ్యనగర్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనదనదల్చిన వారు ఈనెల 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏప్రిల్ 9, 10, 11వ తేదీలలో ఈ క్రీడా సంబరాలు జరుగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండుయాదవ్, డిజ్వర్ సింగ్, నితిన్ నందకర్, సచిన్ కామ్లేకర్ తదితరులున్నారు.

'రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం'



జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: రానున్న ఎన్నికల్లో బీజేపీ అన్ని రాష్ట్రాల్లో విజయం సాధిస్తుందని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఈ మేరకు జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఎలాంటి లాభాపేక్షం లేకుండా జైస్వాల్ కమ్యూనిటీ సేవలందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా జైస్వాల్ సేవా సమితి పేద ప్రజలకు సేవలందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైస్వాల్ కమ్యూనిటీ ప్రతినిధులు శంభునాథ్ జైస్వాల్, సుబోద్ జైస్వాల్, శకుంతల జైస్వాల్ పాల్గొన్నారు.

సందడిగా కలర్స్ డే

గోల్కొండ: చిన్నారులకు రంగుల ప్రాధాన్యతను, వాటి విశేషాలను తెలియపరుస్తుండాలని గోల్కొండ నయాఖిలాలోని ఉర్వా మోడల్ స్కూల్ అకాడమిక్ హెడ్ సబీనా తస్వీర్ అన్నారు. గురువారం పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల వార్షికోత్సవం కలర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు రంగుల రంగుల దుస్తుల్లో ఆడి పాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సాలెహా బేగం, యాస్మిన్ బేగం, సయ్యద్ అర్షియా తదితరులు పాల్గొన్నారు.

బాబురావు కుటుంబాన్ని ఆదుకోండి



వినతి పత్రం అందజేస్తున్న రాంబాబు యాదవ్, లక్ష్మీనారాయణ, రాజీరెడ్డి తదితరులు

అబిడ్స్: వాటర్ బోర్డులో పనిచేస్తూ మృతిచెందిన జీపీఈ బాబురావు కుటుంబాన్ని ఆదుకోవాలని వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, సినియర్ అసోసియేట్ ప్రెసిడెంట్ రాజీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణలు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన బాబురావు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అయన అన్నారు. గురువారం వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మృతిచెందడంతో అతని కుటుంబ సభ్యుల్లో ఒకరికి వాటర్ బోర్డులో ఉద్యోగం ఇవ్వాలన్నారు. అతని వచ్చే బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలన్నారు. పాతబస్తీ మీరాలం ఫిల్టర్ కార్యాలయంలో సీసీ కెమెరాలు రిపేరు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.నారాయణ, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 7 నుంచి దావత్–ఏ–రంజాన్



మాట్లాడుతున్న అనం మీర్జా, మహ్మద్ అసదుద్దీన్

గోల్కొండ: ఈ రంజాన్ మాసాన్ని మరింత శోభాయమానంగా జరుపుకునేందుకు తాము మరింత వినూత్నమైన దావత్–ఏ–రంజాన్ కార్యక్రమాన్ని తెస్తున్నామని అనం మీర్జా అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో దావత్–ఏ–రంజాన్ కర్టెన్ రేజర్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రంజాన్ మాసంలో హైదరాబాద్ నగరం శోభాయమానంగా ఉంటుందని రంజాన్ మాసం సందర్భంగా తాము గత కొన్ని సంవత్సరాల నుంచి దావత్–ఏ–రంజాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 21 వరకు నైట్ బజార్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ బజార్‌లో పిల్లలు, మహిళలతో పాటు అన్ని వయస్సుల వారు ఇష్టపడే దుస్తులతో పాటు రంజాన్ పండుగకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువుల స్టాల్స్ ఉంటాయన్నారు. చిన్న వ్యాపారులకు ప్రోత్సాహం ఇవ్వడం కోసం మహిళలు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ వారు స్టాల్స్ ఏర్పాటు చేస్తారని ఆమె తెలిపారు. హలీంతో పాటు నోరూరించే హైదరాబాదీ వంటలు ఈ నైట్ బజార్ ప్రత్యేకత అని ఆమె తెలిపారు. ప్రెస్‌మీట్‌లో ఇండియా మాజీ క్రికెట్ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ కుమారుడు, మహ్మద్ అసదుద్దీన్, అబెండెన్స్ రీజనల్ హెడ్ జకీర్ జియావుద్దీన్ అలీ తదితరులున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి



కోఠి మహిళా విశ్వవిద్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు



ఏఐవైఎఫ్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ధ్వజమెత్తారు. అఖిలభారత యువజన సమైఖ్య, అఖిల భారత విద్యార్థి సమైఖ్యల ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టి జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ గురువారం నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై విద్యార్థి సంఘాల నాయకులు వరుసగా ఆందోళనలు చేపడుతుండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 21వ తేదీ వరకు టీఎస్‌పీఎస్సీ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.

అధికారులను సస్పెండ్ చేయాలి..

సుల్తాన్‌బజార్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి అనిత రాంచ్రన్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరుతూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో క్లాస్‌లు బహిష్కరించి కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగాల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం దేశంలోనే సంచలనంగా మారినా ఇప్పటి వరకు రాష్ట్రంలోని మంత్రులు కానీ, ఎమ్మెల్యేలు కానీ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఏబీవీపీ నాయకులు సిరివెన్నెల, సబావత్ కల్యాణ్, ఝాన్సీ, మౌనిక, శ్రీదేవి, ఉష, సోని, అక్షిత, రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.